మరమ్మతులు చేసేదెన్నడో..?



మరమ్మతులు చేయాల్సిన రామడుగు-షానగర్ రోడ్డు

- గతేడాది వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- నిధులు మంజూరైనా ప్రారంభంకాని మరమ్మతు పనులు
- వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులు

రామడుగు: గతేడాది జూలై, ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు రోడ్డుపై వెళ్లడానికి ఇబ్బందిపడుతున్నారు. సమస్యలను గుర్తించిన ఇంజనీరింగ్‌శాఖ అధికారులు మండలంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లపై ప్రభుత్వానికి నివేదికను అందజేశారు. ప్రధానంగా దెబ్బతిన్న ఆరు రోడ్లను గుర్తించిన ప్రభుత్వం మరమ్మతులకు ఎఫ్‌డీఆర్(ఫ్లడ్ డెవలప్‌మెంట్ రోడ్స్) కింద రూ. 1.68 లక్షల నిధులు విడుదల చేసింది. కానీ నిధులు మంజూరైనా ఇప్పటివరకు మరమ్మతు పనులు ప్రారంభించడం లేదు.వర్షాకాలం పూర్తయి వేసవికాలం సమీపిస్తున్నప్పటికీ రహదారుల మరమ్మతులు మాత్రం ప్రారంభించలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు తాత్కాలిక మరమ్మతులు చేశారు.

రోడ్ల మరమ్మతులకు మంజూరైన నిధులు

- మండలంలోని వెదిర-వెలిచాల రోడ్డుకు రూ. 31 లక్షలు,
- రంగసాయిపల్లి పీఆర్ రోడ్డు నుంచి రామడుగు బీటీ రోడ్డు వరకు వయా దత్తోజీపల్లికి రూ. 72.45 లక్షలు,
- రంగసాయిపల్లి నుంచి చొప్పదండి మండలం గుమ్లాపూర్ రోడ్డుకు రూ. 11.50 లక్షలు,
- వెదిర నుంచి వెంకటగిరి రోడ్డుకు రూ. 10లక్షలు,
- షానగర్ నుంచి రామడుగు రోడ్డుకు రూ. 22 లక్షలు
- శ్రీరాములపల్లి నుంచి మాడిశెట్టిపల్లి రోడ్డుకు రూ. 22 లక్షలు

మరమ్మతులకు నోచుకోని మరికొన్ని రహదారులు

ఆరు రహదారులకు మాత్రమే నిధులు మంజూరైనప్పటికీ చాలా రహదారులు భారీ వర్షాలతో ధ్వంసమయ్యాయి. మరమ్మతులకు నిధులు మంజూరు కాకపోవడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటపొలాల వద్దకు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని ప్రభుత్వం మిగతా వాటికి కూడా నిధులు మంజూరు చేసి రోడ్లు బాగుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పనులు ప్రారంభిస్తాం



మండలంలో ఆరు రోడ్లు వర్షాలతో దెబ్బతిన్నాయి. మరమ్మతులకు ప్రభుత్వం కోటిన్నర నిధులు మంజూరు చేసింది. పనులు నిర్వహించడానికి టెండర్ ప్రక్రియ జరుగుతోంది. ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తాం.

– సచిన్, ఏఈ (పీఆర్) రామడుగు

త్వరగా పూర్తి చేయాలి



షానగర్ నుంచి రామడుగు వెళ్లే రోడ్డు గతేడాది వర్షాలకు ధ్వంసమైంది. రామడుగు వాగులో కట్టిన వంతెన కూడా పాడైపోయింది. రామడుగుతో పాటు పంట పొలాల వద్దకు వెళ్లడానికి ఇబ్బందిపడుతున్నాం. రోడ్డు మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి. అధికారులు పనులు తక్షణం ప్రారంభించాలని కోరుతున్నాం.

– చిరుత రాంచంద్రం, రైతు, షానగర్

క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



బయోమెట్రిక్ విధానం పరిశీలిస్తున్న ఎంపీపీ

రామడుగు: మండలంలోని గుండి పాఠశాలను గురువారం ఎంపీపీ కలిగేటి కవిత, ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్రా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో బయోమెట్రిక్ విధానం అమలు తీరు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, గోపాల్‌రావుపేటలోని కంటివెలుగు కేంద్రాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. కంటి వెలుగు కేంద్రంలో పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యప్రసన్న, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

సైదాపూర్: అసెంబ్లీ సాక్షిగా బీరప్ప దేవున్ని అవమానించిన చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అదే అసెంబ్లీలో క్షమాపణ చెప్పాలని బీరప్పస్వామి పూజారుల సంఘం (ఉమ్మడి) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అమరగొండ లింగమూర్తి డిమాండ్ చేశారు. గురువారం సైదాపూర్‌లో సంఘం గౌరవ అధ్యక్షుడు అమరగొండ మల్లేశం, సలహాదారుడు అమరగొండ భిక్షపతి, జిల్లా కమిటీ సభ్యుడు అమరగొండ రవిందర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీరప్ప దేవునిలో కేసీఆర్‌ను చూసుకునే గొప్ప పని ఏం చేశాడని ప్రశ్నించారు. గొల్ల కురుమలకు గొర్రెలిస్తామని రూ.1.75 లక్షల యూనిట్‌కు లబ్ధిదారుల వాటా కింద 25 శాతం రూ.43,750 కట్టించుకున్నారని, రెండోవిడత గొర్రెలిస్తామని వాటా కట్టించుకొని ఆరేండ్లు అవుతున్నాకూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గొల్ల కురుమల వాటా ధనం కేసీఆర్ ప్రభుత్వం మింగేసిందని, ఎమ్మెల్యేకు కేసీఆర్ మీద భక్తి ఉంటే రోజూ పూజలు చేసుకోవాలని, గొల్ల కురుమల ఆరాధ్య దైవాన్ని కించపరిచే విధంగా మాట్లాడడం బాధాకరమన్నారు.

స్థలం కబ్జాపై ఫిర్యాదు

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలంకబ్జాకు గురవుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి గురువారం తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా కళాశాల స్థలాన్ని ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకుండా అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

శంకరపట్నం: మండలంలోని కరీంపేట గ్రామంలో గురువారం సీసీరోడ్డు పనులను జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లయ్య, ఎంపీటీసీ తిరుపతి, ఉపసర్పంచ్ కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, ఖాజాపాషా, ప్రదీప్ పాల్గొన్నారు.

గాజుల శంకరయ్యకు నివాళి



మాట్లాడుతున్న వక్తలు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో గురువారం పద్మశాలీ సంఘం నాయకులు మాజీ ఎంపీపీ గాజుల శంకరయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల పరిషత్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి కృషి చేశారని, నక్సల్స్ కిడ్నాప్ చేసి డిమాండ్ల కోసం కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంజయ్‌కుమార్, సర్పంచ్ మల్లయ్య, ఉపసర్పంచ్ హన్మంతు, రామ్, పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బస్వయ్య, ఆరీఫ్ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల ముందస్తు అరెస్టు



జమ్మికుంట: పోలీసుల అదుపులో ఏఎన్‌ఎంలు



చిగురుమామిడి పోలీస్ స్టేషన్ ఎదుట...

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో రెండో ఏఎన్‌ఎంలను పోలీసులు అరెస్టుచేశారు. డిమాండ్ల పరిష్కారానికి గురువారం చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించామని, పదిహేనేళ్లుగా కనీస వేతనానికి నోచుకోక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తక్షణం రెగ్యులరైజ్ చేయాలని, అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరన్నారు. అరెస్టు అయిన వారిలో జెల్ల కవిత, పన్యాల రజిత, భూక్య స్వాతి పలువురు ఉన్నారు.

జమ్మికుంట: సీఐటీయూ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న పట్టణం, మండలంలోని ఏఎన్‌ఎంల జమ్మికుంట పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి ఏళ్ళు గడుస్తున్నాయని, ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌ఆర్‌హెచ్ స్కీమ్ పరిధిలో ఏళ్ల తరబడి పని చేస్తున్నాన్నారు. అరెస్ట్ అయిన వారిలో ఎండీ సాజిదా, పర్వీన్, రజిత, రమ, శ్యామల, రమ, సంధ్య ఉన్నారు.

కాలువ నిర్మాణం ప్రారంభించాలి



కాలువను పరిశీలిస్తున్న డీఈ సదయ్య

తిమ్మాపూర్: తోటపల్లి రిజర్వాయర్ నుంచి పెద్దరుపల్లి మీదుగా పోరండ్ల కాలువ నిర్మాణం ప్రారంభించాలని ఎస్సారెస్పీ డీఈ సదయ్య కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కాలువ పనులు చేయకపోవడంతో పోరండ్ల పరిధిలోని పంటలకు నీరందని పరిస్థితి నెలకొంది. పలుమార్లు సర్పంచ్ రెడ్డి త్రివేణి పని చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. కానీ స్పందించకపోవడంతో సమస్యను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కాలువ పనులు ప్రారంభించాలని ఎస్సారెస్పీ అధికారులకు సూచించారు. ఈమేరకు డీఈ కాంట్రాక్టర్‌తో మాట్లాడి కాలువను పరిశీలించారు.



15న ఆరెకుల ఆత్మగౌరవ బహిరంగ సభ

జమ్మికుంట: ఆరెకుల ఆత్మగౌరవ బహిరంగ సభ విజయవంతం చేయాలని ఆరెకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శెట్టిపల్లి శివాజీ పిలుపు నిచ్చారు. గురువారం పట్టణంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంగిలే రామరావు ఆధ్వర్యంలో జిల్లా, మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. 15వ తేదీన హైదరాబాద్‌లో ఆరెకుల ఆత్మగౌరవ భవన నిర్మాణ భూమిపూజ, బహిరంగ సభకు కదలి రావాలని కోరారు. మండలాల వారీగా ఇన్‌చార్జీలను నియామకం చేపడతామన్నారు. ప్రతి గ్రామంలో ఇంటికి ఒక్కరూ స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భుజంగరావు, శివన్న, నాగేశ్వర్‌రావు, బాపురావు, ప్రభాకర్, జిల్లా నాయకులు వెంకన్న, శ్రీనివాస్, సంపత్, కిషన్‌రావు, మండల అధ్యక్షుడు సంపత్‌రావు, సతీష్, శ్రీనివాస్, గ్యారంపల్లి రాజేశ్వర్‌రావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

చొప్పదండి: కొండగట్టు అంజన్న ఆలయానికి రూ. వంద కోట్లు కేటాయించడం పట్ల ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గురువారం సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిధుల మంజూరు, కొండగట్టు మాస్టర్ ప్లాన్‌తో రూపురేఖలు మారుతాయన్నారు. ఇటీవల జగిత్యాల సమావేశంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రూ. వంద కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఆయన ప్రత్యేక దృష్టి సారించడంతో కొండగట్టు దేవస్థానం దశ, దిశ మారుతుందని పేర్కొన్నారు.

సీపీని కలిసిన ప్రభాకర్



పుష్పగుచ్ఛం అందిస్తున్న అంబాల ప్రభాకర్

జమ్మికుంట: జాతీయ కళారత్న అవార్డు గ్రహీత, పట్టణానికి చెందిన అంబాల ప్రభాకర్ కరీంనగర్ సీపీ సుబ్బారాయుడును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్ సీపీగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన చిందం లచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి ఆధార్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, కరీంనగర్ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ గురువారం ఐదువేల ఆర్థికసాయం అందజేశారు. వెంట మానవ హక్కుల పరిరక్షణ ఉద్యమ సంస్థ జిల్లా అధ్యక్షుడు పుల్కం నర్సయ్య, బీఆర్‌ఎస్ నాయకులు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



నిర్లక్ష్యమా.. వేరే కారణమా..!

ఇల్లందకుంట: అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమో మరే ఇతర కారణమో తెలియదుకానీ రెండేళ్ల క్రితం రూ. 10 లక్షలతో కొనుగోలు చేసిన వైకుంఠరథాన్ని పట్టించుకునేవారు కరువయ్యారు. మృతదేహాలను శ్మశానవాటికలకు తరలించేందుకు సమకూర్చిన వైకుంఠరథం ప్రారంభానికి నోచుకోక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఓ మూలకే పరిమితమై తుప్పు పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారిపేరు : వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీవో
ఫోన్ నంబర్ 94948 07026

కేంద్ర బడ్జెట్‌లో రైతాంగానికి నిరాశే



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

జమ్మికుంట: కేంద్ర బడ్జెట్‌లో రైతాంగానికి, సీసీఐ సంస్థ, పేద బడుగు బలహీన వర్గాలకు నిరాశే ఎదురైందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కొప్పుల శంకర్ అధ్యక్షతన జోన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ధరలు పతనమైనప్పుడు సీసీఐ ద్వారా కొనుగోళ్లు చేసి, రైతుకు మద్దతు కల్పించాల్సి ఉంటుందని, గతేడా సీసీఐ సంస్థకు రూ.9,300 కోట్లు కేటాయిస్తే, 2023 బడ్జెట్‌లో లక్ష రూపాయలు కేటాయించడం రైతుల ప్రయోజనాన్ని దెబ్బతీసి, దళారులు, కార్పొరేటు సంస్థలకు మేలు చేసే విధంగా ఉందన్నారు. పత్తి రైతులు, సంస్థ ఉద్యోగులు ఆందోళనకు గురైతున్నారని, ఆహార భద్రత, సంక్షేమ రంగం, ఉపాధి హామీ పథకాలకు కోతలు విధించి నిర్వీర్యం చేసుందని, బీజేపీ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించక నిరుద్యోగాన్ని మరింత పెంచిందన్నారు. మతోన్మాద దాడులు, మహిళలపై హత్యలు, అత్యాచారలు, లైంగిక వేధింపులు పెరిగాయని సాధికారత బడ్జెట్‌లో చిన్నచూపు చూసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలని, అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలని, నివేశన స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి ఐదులక్షలు ఇవ్వాలని, గిరిజన బంధుకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడం సిగ్గుచేటు అన్నారు. సమావేశంలో జోన్ కార్యదర్శి శీలం అశోక్, సభ్యులు చల్లూరి రాములు, తిప్పరబోయిన శ్రీకాంత్, రమేష్‌యాదవ్, బాసిర సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దొరికిన చెక్కు అందజేత

రామడుగు: రోడ్డుపై పడిపోయిన చెక్కును గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంట్ల వెంకట్‌రెడ్డి బ్యాంకు మేనేజరుకు అందజేశాడు. రామడుగుకు చెందిన మేడారం రాజేశం గురువారం దక్కన్ గ్రామీణ బ్యాంకులో రూ. 60 వేలు డ్రా చేసుకోవడానికి వెళ్లాడు. తన చెక్కు మార్గమధ్యలో పడిపోయింది. రోడ్డుపై పడిపోయిన చెక్కు వెంకట్‌రెడ్డికి కనిపించడంతో తీసుకొని నేరుగా బ్యాంకు మేనేజర్ లక్ష్మారెడ్డికి అందజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లిలో పోచమ్మ గుడి నిర్మాణానికి దాతలు గురువారం విరాళం అందజేశారు. ఎజ్జ కొమురయ్య రూ .15,116, తాటికంటి శ్రీనివాస్ రూ.10,216, బోళవేన రాములురూ.10,116, బండారి బాలరాజు రూ.10,116, బండారి కుమారస్వామి రూ.10,116 అందజేశారని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

బాలికలకు కరాటే శిక్షణ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించామని హెచ్‌ఎం అంజయ్య తెలిపారు. కలెక్టర్ ఆదేశానుసారం బాలికల ఆత్మరక్షణ కోసం తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో కరాటే మాస్టర్ ఎస్కే జలీల్, తదితరులు ఉన్నారు.

మరమ్మతులు చేయకపోతే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

గంగాధర: నారాయణపూర్ రిజర్వాయర్ కట్టకు ప్రభుత్వం తక్షణం మరమ్మతులు చేపట్టి యాసంగికి సాగునీరు అందించాలని లేదంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం హెచ్చరించారు. మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌ను గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... ఎమ్మెల్యే రవిశంకర్ నిర్లక్ష్యంతోనే పనులు ఆలస్యమవుతున్నాయని, దీంతో రైతులకు తీరని నష్టం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుచ్చయ్య, నాయకులు గంగయ్య, భాస్కర్, అశోక్, రాయమల్లు, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశం, రాజు, రాజశేఖర్‌రెడ్డి, కరుణాకర్ పలువురు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

సైదాపూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సైదాపూర్ ఎస్సై ఆరోగ్యం సూచించారు. జాతీయ వాలీబాల్ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆకునూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించానని అన్నారు. క్రీడలు దేహదారుఢ్యానికి, ఆరోగ్యానికి దోహదపడతాయని, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. అనంతరం ఎస్సైని ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనురాధ, టీచర్లు రవీందర్‌రెడ్డి, సుధాకర్, భాస్కర్, సమ్మయ్య, రాజు, రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, మాలతి, స్వర్ణలత ఉన్నారు.

సంత్ రవిదాస్ జీవితం అందరికి స్ఫూర్తి



చర్మకారులను సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్: సంత్ రవిదాస్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో రవిదాస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని చర్మకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దశాబ్దాల క్రితం భారతదేశంలో భక్తి ఉద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించిన అధ్యాత్మిక యోధుడని, భక్తికి, జ్ఞానానికి కులం ప్రధానం కాదని, సన్మార్గంలో భగవంతుడిని చేరుకోవచ్చని సూచించిన మహోన్నీయుడన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, ముత్యంరావు, సుధాకర్, తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

రెవెళ్లిలో బొడ్రాయి పూజలు



పూజలు నిర్వహిస్తున్న రెవెళ్ల గ్రామస్తులు

చొప్పదండి: మండలంలోని రెవెళ్లి గ్రామంలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపనకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ గుడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మూడు రోజుల పాటు పూజలు చేస్తున్నారు. 108 కళశాలతో వేద పండితులు హోమం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో బందారపు అజయ్‌కుమార్, కొత్తూరి లింగమ్మ, కొత్తూరి రాజేందర్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీగణపతి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



జమ్మికుంట: పూజలు చేస్తున్న వేద పండితులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి హౌజింగ్ బోర్డు కాలనీలోని శ్రీలక్ష్మీగణపతి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు, ఆలయ అర్చకులు సముద్రాల ప్రసాదాచార్యులు, కిషోరాచార్యులు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు, దాతల సహకారంతో మహా అన్నదానం కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో సాయి సేవా సమితి, కాలనీ వాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.